సాక్షి
కుమురం భీం
ఆదివారం । 22 । జూన్ । 2025



ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸



మేఘూమా.. వర్షించుమా..!

మృగశిర కార్తె ప్రవేశించి పది రోజులు దాటినా వరుణుడు కరుణించడంలేదు. ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం పడకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /28.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

27నుంచి జిల్లాలోని విహారయాత్రలకు బస్సు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపో ఆధ్వర్యంలో ఈనెల 27నుంచి రెబ్బెన మండలం గంగాపూర్ బాలాజీస్వామి దేవాలయం, కెరమెరి మండలం జోడేఘాట్‌కు బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు డిపో మేనేజర్ కేవీ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ బస్టాండ్ నుంచి ఉదయం 8 గంటలకు బస్సు ప్రారంభమై గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ నదీస్నానం, స్వామివారి దర్శనం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు బయలు దేరుతుందని తెలిపారు. సాయంత్రం 7గంటలకు ఆసిఫాబాద్‌కు చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. 170 కిలోమీటర్ల ప్రయాణానికి పిల్లలకు రూ.140, పెద్దలకు రూ.280 చార్జి నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 6300489162, 9959226006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతిపాదన పునఃపరిశీలించాలి



ఏలుసింగ్ మేరుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, రామారావుపటేల్

కాగజ్‌నగర్ టౌన్: జిల్లాకు టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని పీసీసీఎఫ్ ప్రొటెక్షన్, విజిలెన్స్ అండ్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డన్ ఏలుసింగ్ మేరును ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. కుమురభీం ఆసిఫాబాద్ జిల్లాకు టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ జీవో 49 కారణంగా ఆదివాసీలు, గిరిజనేతరులు ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తాయని తెలిపారు. దీంతో జిల్లా అభివృద్ధి కుంటుపడుతుందని వివరించారు. వెంటనే టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు.

కఠినచర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న తుడుం దెబ్బ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీ మహిళలను మోసగించి అక్రమ రవాణా చేసినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని తుడం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నక విజయ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ మహిళలను మోసగించడం బాధాకరమని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. నిందితులపై పీడీ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న చిత్తరంజన్‌దాస్

లింగాపూర్: వార్షిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ దాస్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్, పోలీస్‌స్టేషన్ ఆవరణ, పరిసరాలు పరిశీలించారు. ఎస్సై గంగన్నతోపాటు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. సమస్యలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలు అ మర్చుకునేలా ప్రజలను చైతన్యపర్చాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆయన వెంట జైనూర్ సీఐ రమేశ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆసిఫాబాద్‌అర్బన్: అర్హులందరికీ ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డు సందీప్‌నగర్‌లో పలువురు లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా ఆయన భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ పథకం నిరుపేదలకు వరం లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు రాపర్తి కార్తిక్, అసద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పౌష్టికాహారం

- అమలులోకి ఫేషియల్ రికగ్నిషన్
- సరుకులు పక్కదారి పట్టకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు
- వచ్చేనెల 1నుంచి అమలులోకి..
- మొదటగా చిన్నారుల తల్లులకే..



కెరమెరి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. తల్లుల ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయాలని భావిస్తోంది. ఆరునెలలుగా మూడేళ్ల చిన్నారులకు అందించే బాలామృతం, గుడ్ల పంపిణీకి మాత్రమే దీనిని వినియోగిస్తోంది. ఇందుకు ఫోన్ ట్రాకర్ యాప్‌లో తల్లుల ముఖ గుర్తింపు నమోదు చేస్తోంది. ప్రస్తుతం పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలులోకి తెచ్చేందుకు నిర్ణయించింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ప్రక్రియ జూలై 1నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వచ్చే నెల నుంచి పకడ్బందీగా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ నమోదు తప్పనిసరి చేసింది. సరుకులు పక్కదారి పట్టకుండా ఈ ప్రక్రియ అమలు చేయనుంది. ఈ మేరకు కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలోని అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏప్రిల్ నుంచే ఈ ప్రక్రియ కొనసాగుతుండగా.. కొందరికి ఫోన్ ట్రాకర్ పనిచేయక పోగా.. దీన్ని వచ్చే నెల నుంచి పకడ్బందీగా అమలు చేయనున్నారు. వచ్చే నెల నుంచి అంగన్‌వాడీ టీచర్లకు గతంలో అందజేసిన ఫోన్‌లో పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా యాప్‌ను అప్‌డేట్ చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేపట్టనుండడంతో క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులుండవు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ ఏ మేరకు జరుగుతుందో దీని ద్వారా జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది.

ఇప్పటివరకు చిన్నారులకే..

ఫేషియల్ రికగ్నిషన్ విధానం ఆరు మాసాల వారి నుంచి మూడేళ్ల చిన్నారులకు పంపిణీ చేసే అదనపు ఆహారమైన బాలామృతం, గుడ్ల పంపిణీకి మాత్రమే ఇప్పటివరకు వర్తించేది. మూడేళ్లలోపు చిన్నారులకు ఇంటికి ఇచ్చే పోషకాహారాన్ని రిజిస్ట్రేషన్ అయిన తల్లి లేదా తండ్రి ఫొటోను ఫోన్‌లో నమోదు చేసి పంపిణీ చేస్తారు. ప్రస్తుతానికి నమోదు ఇదొక్కటే అయినప్పటికీ రానురాను అన్ని సరుకులను ఫేషియల్ రికగ్నిషన్ ప్రక్రియ ద్వారా పంపిణీ చేయనున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఈ విధానం ద్వారానే అందించనున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీల వివరాలు			
	ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5	అంగన్‌వాడీ కేంద్రాలు: 973	టీచర్ల సంఖ్య: 880
	చిన్నారుల సంఖ్య: 32వేలు		

అమలయ్యేలా చూస్తాం



ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలయ్యేలా చూస్తాం. ఇప్పటికే కొన్ని చోట్ల ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే నెల 1నుంచి దీన్ని పూర్తి స్థాయిలో అమలులోకి తెస్తాం. ప్రస్తుతం చిన్నారుల సరుకుల పంపిణీకి మాత్రమే ఉపయోగిస్తున్నాం. రిజిస్టేషన్ అయిన వారి ఫొటో మాత్రమే రికగ్నైజ్ అవుతుంది.

– రెబిక, ఐసీడీఎస్ సీడీపీవో, వాంకిడి

యోగా జీవితంలో భాగం కావాలి



ఆసిఫాబాద్ అర్బన్: యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఘనంగా యోగా దినోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీ ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా అధికారులు, ఉద్యోగులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగా చేస్తే శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. మనస్సును ఏకం చేసి ఒత్తిడి, ఆందోళన తొలగిస్తుందని పేర్కొన్నారు. అనంతరం యోగాపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించుకోవాలి

యోగాతో ఒత్తిడి తగ్గించుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరై యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురైతే యోగా ద్వారా తగ్గించుకోవచ్చని సూచించారు. ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, డీసీఆర్బీ డీఎస్పీ విష్ణుమూర్తి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టులో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. అలాగే యోగా గురువు అశోక్ ఆర్య ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పలువురు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం యువకులకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యోగా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ నాగరాజు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

కాగజ్‌నగర్ టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో భారత్ స్వాభిమాన్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని, ఆరోగ్యవంతమైన జీవితానికి ఇది చక్కటి మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగా ప్రచారక్ దాసరి వినోద్‌గౌడ్, రవీందర్ గౌడ్, వినోద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, యోగా శిక్షకుడు సత్యనారాయణ, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ఫిర్దోజ్, శిక్షకులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ దాస్, అధికారులు



సిర్పూర్(టి): యోగాసనాలు వేస్తున్న మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం, కోర్టు సిబ్బంది

రైతు సంక్షేమానికే పథకాలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఓ ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా సాయం అందడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పత్తి, కంది, జొన్నతోపాటు వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తోందని తెలిపారు. జిల్లాలోని 1,42,386 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.264.30 కోట్ల పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా శనివారం నాటికి 1,27,161 మంది రైతుల ఖాతాల్లో రూ.213.90 కోట్లు జమ అయినట్లు వివరించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించేందుకు 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమ, అభివృద్ధికి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

వాంకిడి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. శనివారం వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతగా మెలగాలని, సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.

'పీఎం జుగా'తో మౌలిక వసతులు



కెరమెరి: ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ రమాదేవి

కెరమెరి(ఆసిఫాబాద్): 'పీఎం జుగా' పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ పీ రమాదేవి తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొఠారి గ్రామంలో 'పీఎం జుగా' అమలు తీరుపై ఆదివాసీలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ పథకం ద్వారా రోడ్డు రవాణా, పాఠశాల, అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనాలు, పక్కా గృహాలు తదితర మౌలిక సదుపాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తాయని చెప్పారు. అత్యంత వెనుకబడిన గిరిజనులు అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతోనే ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దగ్గరలోనే క్యాంపులు ప్రారంభించి ఆధార్, పీఎం కిసాన్ కార్డులు, జన్‌ధన్ ఖాతాలు తదితర సేవలు అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ అష్మద్ పాషా, కార్యదర్శి సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

పథకంతో గ్రామాలాభివృద్ధి

వాంకిడి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం జుగా పథకం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సోనాపూర్ రైతు వేదికలో అంతర్జాతీయ యోగా దినోత్సవం, పీఎం జుగా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏటీడబ్ల్యూవో చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.

లింగాపూర్ మండల కేంద్రంలో..

లింగాపూర్: ఏజెన్సీ ప్రాంతాల గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జుగా కార్యక్రమంపై శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గిరిజనులకు దాదాపు 90శాతం సబ్సిడీతో జీవనోపాధికి యూనిట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజర్ ముఖేశ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.



లింగాపూర్: అవగాహన కల్పిస్తున్న అధికారులు



వాంకిడి: మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

గం'జాయ్'..!

- జిల్లా ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న అమ్మకాలు, వినియోగం
- యువకులు, విద్యార్థులే లక్ష్యంగా జోరుగా విక్రయాలు



కౌటాల: మత్తు పదార్థాల వ్యసనం పట్టణం నుంచి పల్లెకు పాకింది. జిల్లాలో గంజాయి వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. ఇంటర్, డిగ్రీ చదువుతున్న వారితో పాటు పాఠశాలల విద్యార్థులు మత్తుకు బానిసవుతున్నారు. వీరి అలవాటును అవకాశంగా మలుచుకుని కొందరు గంజాయి రవాణా, అమ్మకాలతో వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలోని సరిహద్దు మండలాలైన కౌటాల, వాంకిడి, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్ మీదుగా మత్తు పదార్థాలను సరిహద్దు దాటించి స్థానికంగా విక్రయాలు జరుపుతున్నారు. అలాగే జిల్లాలోని కొందరు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నారు. వానాకాలం సాగు సమయంలో పత్తి, ఇతర పంటల్లో ఈ మొక్కలు పెంచుతున్నారు. కౌటాలలో చాక్లెట్ల రూపంలో గంజాయి విక్రయిస్తున్నారని, తమ పిల్లలు ఎక్కడ మత్తు బారిన పడతారోనని తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2022లో 22 కేసులు నమోదు కాగా, 8.5 కిలోల గంజాయి పట్టుకుని 203 మొక్కలు ధ్వంసం చేశారు. అలాగే 2023లో 32 కేసులు నమోదయ్యాయి. 2024లో 39కేసులు నమోదు చేశారు. గతేడాది జిల్లాలో 298.8 కిలోల గంజాయి, 121 మొక్కలు స్వాధీనం చేసుకున్నారు.

కట్టడి అయ్యేనా..?

'జిల్లాలో మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం, ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా చర్యలు తీసుకుంటాం' అని.. ఇటీవల కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే హెచ్చరించారు. గంజాయి సాగును గుర్తించి సంక్షేమ పథకాలు నిలిపివేయాలని, పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలు, కళాశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 26న అంతర్జాతీయ డ్రగ్స్‌డే సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అయితే గంజాయి విక్రేతలపై నిఘా అంతంతే ఉండటంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అడపాదడపా కేసులు మాత్రమే నమోదు చేస్తున్నా.. పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, మండల కేంద్రాల్లో రాత్రివేళల్లో కొంతమంది యువత మత్తులో వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకు గురిచేస్తోంది.

చాక్లెట్ల రూపంలో అమ్మకాలు..?


గంజాయిని విక్రయదారుల నిత్యావసర వస్తువుల పేరుతో సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. ప్రత్యేక ఏజెంట్లను నియమించుకుని దందా సాగిస్తున్నారు. వేకువజామున వాహనాల్లో చాక్లెట్ల రూపంలో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. చాక్లెట్ల రూపంలోని ఈ పదార్థానికి విద్యార్థులు సులువుగా ఆకర్షితులవుతున్నారు. తక్కువ ధరలో లభించడం.. మత్తు ఎక్కువసేపు ఉండడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకొన్ని చోట్ల సిగరెట్లలోని పొగాకు తొలగించి, దాని స్థానంలో గంజాయిని నింపుతున్నారు. 10 గ్రాముల గంజాయి ప్యాకెట్ రూ.500 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నట్లు తెలిసింది. గంజాయి నింపిన ఒక్కో సిగరెట్‌ను రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటిని వినియోగిస్తున్న వారిలో ఎక్కువగా యువతే ఉండడం గమనార్హం. అందులోనూ 30 ఏళ్లలోపు వారే అధికం. వారు బానిసలుగా మారి కుటుంబ సభ్యులపై గొడవలకు దిగుతున్నారు. మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. జిల్లాలోని యువత మత్తుకు బానిస కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలోని సీబాపు కాలనీ పెద్దవాగు సమీపానికి గంజాయి సేవించడానికే యువత వస్తారని స్థానికులు చెబుతున్నారు. ఇది జిల్లా ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.

ఇటీవలి ఘటనలు

- వాంకిడి మండలం అర్లీ గ్రామానికి చెందిన లెండుగురె రాజును మే 18న మండల కేంద్రంలో పోలీసులు తనిఖీ చేశారు. అతడి వద్ద నుంచి రూ.6,250 విలువైన మూడు ప్యాకెట్లలో 250 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- బెజ్జూర్ మండలం కుశ్నపల్లి సమీపంలో మే 24న గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సులుగుపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిడాం సంతోష్ బైక్‌పై తరలిస్తున్న రూ.3,86,970 విలువైన 3.47 కిలో గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఆసిఫాబాద్ మండలం దాంపూర్‌కు చెందిన అన్నాజీ ఇంట్లో ఈనెల 13న పోలీసులు సోదా చేశారు. ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 295 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం



జిల్లాలో గంజాయి విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. తల్లిదండ్రులు పిల్లలకు అవసరాలకు మించి డబ్బు ఇవ్వొద్దు. గంజాయి విక్రేతలపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకుంటున్నాం. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే డయల్ 100, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్

క్లుప్తంగా

ద్విచక్రవాహనం చోరీ

లక్ష్మణచాంద: మండలంలోని పెట్రోల్ బంక్ (ఐశ్వర్య ఫిల్లింగ్ స్టేషన్ కనకాపూర్)లో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్‌లోని బేస్తావార్ పేట్‌కు చెందిన గరిపెల్లి సురేశ్..పెట్రోల్ బంక్(ఐశ్వర్య ఫిల్లింగ్ స్టేషన్ కనకాపూర్)లో పనిచేస్తున్నాడు. తన బైక్‌ను శుక్రవారం పెట్రోల్‌బంక్ వద్ద నిలిపి ఉంచాడు. శనివారం ఉదయం కనిపించకపోవడంతో సీసీ ఫుటేజీని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లినట్లు రికార్డయింది. బాధితుడు సురేశ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

దేశీదారు తరలిస్తున్న ముగ్గురి పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. గత వారం రోజుల్లో ముగ్గురు దేశీదారు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. భోరజ్ మండలం పెండల్వాడకు చెందిన కాప్లే అశోక్, భీంపూర్ మండలం లింగాగూడకు చెందిన టేకం రజిత, ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరికి చెందిన కాకర్ల అరుణ్‌లను పట్టుకుని వారి నుంచి రూ.5వేల విలువ గల 140 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నానంగ్ సింగ్, హన్మంత్, వెంకటగిరి, తానాజీ, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు రాయి సునీల్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకోగా ఆయన వద్ద మట్కా చిట్టీలు, రూ.460 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్వాహకుడు మహారాష్ట్రలోని బోరిలో గల అశోక్ సామ్రాట్ మట్కా నిర్వహణ కేంద్రానికి డబ్బులు పంపుతున్నట్లుగా పేర్కొన్నారు.

కోడలిపై దాడి చేసిన మామపై..

ఆదిలాబాద్‌రూరల్: కోడలిపై దాడి చేసిన మామపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన మాజిద్ రెండు రోజుల క్రితం తన కోడలు జాబా కౌసర్‌పై ప్లాస్టిక్ పైప్‌తో దాడి చేశాడు. గాయాలైన ఆమె చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంది. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు మాజిద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జింకపిల్ల అప్పగింత



జింకపిల్లను అప్పగిస్తున్న ఎస్సై బిట్ల పెర్సిస్

ముధోల్: మండల కేంద్రంలోని పంట పొలంలో శనివారం కుక్కలు జింకపిల్లపై దాడి చేయడానికి వెంటడాయి. రైతులు గమనించి దాన్ని కాపాడారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై బిట్ల పెర్సిస్‌కు అందజేశారు. ఆమె అటవీశాఖ అధికారి కృష్ణకు సమాచారం అందజేసి జింక పిల్లను అప్పగించారు.

తీరని మందుల కొరత



నస్పూర్ కాలనీ డిస్పెన్సరీలో మందులు తీసుకుంటున్న కార్మికులు

- బీపీ గోళీల కోసం అవస్థలు
- ఇబ్బంది పడుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మందుల కొరత తీరడం లేదు. రూ.కోట్ల లాభాలు గడిస్తున్న కంపెనీలో మందుల కొరత వెక్కిరిస్తోంది. కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో ఇదే పరిస్థితి ఉంది. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో మరింత అధ్వానంగా ఉంది. రెండు నెలలుగా బీపీకి సరిపడా గోళీలు ఇవ్వకపోవడంతో జబ్బుల బారిన పడ్డవారు అవస్థలు పడుతున్నారు. మందుల కొనుగోలులో కార్పొరేట్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ సమస్య ఏర్పడిందని కార్మిక సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే శ్రీరాపూర్ ఏరియా పరిధిలో ప్రతీనెల 11 వేల మంది బీపీ మాత్రలు తీసుకుంటున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కార్మికులతోపాటు రిటైర్డు కార్మికులు, కుటుంబ సభ్యులు ఇందులో ఉన్నారు. మే నెలలో బీపీ, షుగర్ మందుల కొరత ఉండేది. షుగర్ మందుల కొరత తీరినా ప్రస్తుతం బీపీ గోళీల సమస్య అలాగే ఉంది. బీపీ ఉన్న వారిని ప్రతీనెల కంపెనీ దవాఖానాలో వైద్యుడిని సంప్రదించి పరీక్షించుకున్న తర్వాత వారికి నెలకు సరిపడా మందులు ఇస్తారు. ప్రస్తుతం మందుల కొరత వల్ల కేవలం పది రోజులకు మాత్రమే ముందు ఇచ్చి పంపి తిరిగి రమన్నంటున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్కే 8 కాలనీ, నస్పూర్ కాలనీల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటి ద్వారా మందులు తీసుకుంటున్న కార్మికులు రెండునెలల నుంచి సరిపడా ఇవ్వకపోవడంతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ కార్మికులు వారి స్వస్థలాల నుంచి మందుల కోసం ప్రతీ పది రోజులకోసారి రావడం ఇబ్బందిగా మారింది.

ఇబ్బంది పడుతున్నాం



నాకు బీపీ, గుండె జబ్బు ఉంది. రెండు నెలల నుంచి మందులు సరిపడా ఇవ్వడం లేదు. ప్రతీనెల మూడు సార్లు మందుల కోసం ముల్కల్ల నుంచి ఇక్కడి ఆసుపత్రికి రావాల్సి వస్తుంది. ఇన్నిసార్లు రావడంతో ఇబ్బంది పడుతున్నాం.

– డి.లింగయ్య, రిటైర్డ్ కార్మికుడు

త్వరలో నెలకు సరిపడా ఇస్తాం

కొన్నిరోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుంది. ప్రస్తుతం బీపీ మందులు మాత్రమే కొరత ఉంది. మందులు లేవని ఎవరిని తిప్పి పంపడం లేదు. నెలకు ఇచ్చే మందులు పది రోజులకు ఇచ్చి పంపిస్తున్నాం. త్వరలోనే నెల మందులు ఇస్తాం.

– పి.రమేశ్‌బాబు, డీవైసీఎంఓ

కళాశాల విక్రయించి ఉడాయించిన యాజమాన్యం

- రూ.కోట్లు టోకరా..!?
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం సుమారు రూ.2కోట్లు టోకరా వేసి ఉడాయించడం చర్చనీయాంశంగా మారింది. అప్పులు ఇచ్చిన బాధితులు సుమారు 70మంది ఉండగా వీరిలో కొందరు న్యాయం కోసం శనివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం ప్రకారం.. మంచిర్యాలలోని ప్రైవేటు కళాశాల యాజమాన్యం రిక్కల మహేందర్‌రెడ్డి కళాశాల, భవనం విక్రయించి వెళ్లిపోయాడని ఆరోపిస్తున్నారు. కళాశాల విద్యార్థుల సర్టిఫికేట్లు కళాశాలకు సంబంధం లేని అతడి స్నేహితుడు లక్సెట్టిపేటకు చెందిన ఓ ప్రైవేటు కళాశాల యజమానికి అప్పగించాడని పేర్కొంటున్నారు. సర్టిఫికేట్లు ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.6వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పై చదువులకు వెళ్లేందుకు టీసీ, సర్టిఫికేట్లు అవసరం ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సర్టిఫికేట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక సీఐని సంప్రదించగా.. విషయం తమ దృష్టికి వచ్చిందని, బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని పేర్కొన్నారు.

ఫోర్జరీ, చీటింగ్ కేసులో ఒకరికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఇంటి స్థలాల ఫోర్జరీ, చీటింగ్ కేసులో ఒకరికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హుస్సేన్ తెలిపారు. మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వకుళభరణం ఆదినాథ్ ఆయన భార్య రజినిలు 2010లో మావల స్టేషన్ పరిధిలోని శోభకు ఖానాపూర్ శివారులో ఫారెస్ట్ భూమిని తన పేరిట ఉందని నమ్మించి నాలుగు ప్లాట్లు విక్రయించారు. ఆ ప్లాట్లకు గాను రూ.3.30 లక్షలు తీసుకున్నారు. బాధితురాలికి విక్రయించిన ప్లాట్లను 2022లో ఫారెస్ట్ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ విషయం బాధితురాలికి తెలిసింది. తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆదినాథ్, రజినిని కోరగా, కోర్టులో చూసుకోవాలని, మీకు నచ్చిన వారికి చెప్పుకోమని బెదిరించారు. ఈనెల19న బాధితురాలు మావల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఆదినాథ్‌ను అరెస్టు చేయగా, భార్య రజిని పరారీలో ఉన్నారు. సమావేశంలో మావల సీఐ కర్రె స్వామి, ఎస్సైలు ముజాహిద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో శిక్షణకు నిర్మల్ ఉపాధ్యాయుడు



ఎల్మల ప్రవీణ్ కుమార్

నిర్మల్‌ఖిల్లా/లోకేశ్వరం: జాతీయ విద్యా విధానం–2020 లక్ష్యాలకనుగుణంగా విద్యార్థుల్లో సృజనాత్మక సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదపడే ''కళలు(తోలుబొమ్మలాట)–వాటి పాత్ర'' అనే అంశంపై ఢిల్లీలో జరిగే శిక్షణ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. లోకేశ్వరం మండలం సేవాలాల్ తాండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్మల ప్రవీణ్‌కుమార్ శిక్షణకు హాజరుకానున్నారు. ఇదివరకే జిల్లా నుంచి ఉత్తమ బోధనా విధానాల అమలులో రాష్ట్రస్థాయికి ఎంపికై తన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను గత ఏప్రిల్‌లో హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఎంఈవోల ఎదుట ప్రదర్శన ఇచ్చారు. జూలై 3 నుంచి 17వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపికచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రవీణ్‌కుమార్ ఒక్కరే ఎంపికయ్యారు. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేశ్ ఉత్తర్వులు వెలువరించారు. విద్యార్థులకు అర్థమయ్యే సృజనాత్మక అభ్యసన ప్రక్రియలో భాగంగా తోలుబొమ్మలాట, సాహిత్యం, నాటకం వంటి కళారూపాలను మిళితం చేసి విద్యార్థుల్లో కృత్యాధార సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు.

అడవి అలుగు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న అడవి అలుగు

ఖానాపూర్: వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన అడవి అలుగును అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 19న అడవి అలుగును వేటాడి క్రయ, విక్రయాలు చేస్తున్న ముఠా సంచరిస్తున్న సమాచారంతో అధికారులు రంగంలోకి దిగారు. వెంటనే విచారణ చేపట్టి 8 మందిపై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో వేటాడి పట్టుకున్న అలుగును అటవీశాఖ కార్యాలయం వెనుకభాగంలో వదిలివెళ్లినట్లు నిందితులు వెల్లడించినట్లు సమాచారం. శుక్రవారం అధికారులు.. అలుగును వదిలివెళ్లిన ప్రాంతంలోని నివాసాల్లో గాలించినా దొరలేదు. కాగా, ఇదివరకు అలుగును దాచినవారు తమపై కేసులు నమోదవుతాయనే భయంతో శనివారం ఉదయం ఫారెస్ట్ కార్యాలయం వెనుక భాగంలో వదిలివెళ్లారు. దీంతో అధికారులు అలుగును స్వాధీనం చేసుకున్నారు. కాగా, కేసు పూర్తి వివరాలను ఆదివారం వెల్లడించనున్నట్లు ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు



పోటీలకు హాజరైన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జూనియర్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 60 మంది క్రీడాకారులు హాజరు కాగా, అందులో నుంచి 32 మందిని ఎంపిక చేశారు. తుది జట్టు ఎంపిక చేసిన తర్వాత ఈనెల 28న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రఘునాథరెడ్డి తెలిపారు. పీడీ రేణి రాజయ్య, కోచ్ రవి, పీఈటీ సురేందర్, శేఖర్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య జీవనం

- ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్



యోగా చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, విద్యార్థులు

బాసర: ప్రతి ఒక్కరూ యోగా చేయాలని, దినచర్యలో భాగం చేసుకోవడంతో ఆరోగ్యకర జీవనం కొనసాగించాలని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ట్రిపుల్ ఐటీలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకురాలు శ్రీలక్ష్మి హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి నివారించేందుకు యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో సమన్వయ కర్త డాక్టర్ రాకేశ్‌రెడ్డి, డాక్టర్ విజయ్కుమార్, డాక్టర్ శ్రవణ్రెడ్డి, పీడీ శ్యామ్‌బాబు, కౌన్సిలర్ నాగలక్ష్మి, టీచింగ్, నాన్ టీచింగ్‌స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్ జట్టుపై యెల్లో జట్టు విజయం





దర్శ్ అగర్వాల్ (80రన్స్) ఎండీ అనస్ (4 వికెట్లు)

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడిపేట్ బెటాలియన్‌లో శనివారం జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను కమాండెంట్ వెంకటరాములు ప్రారంభించారు. యెల్లో, రెడ్ జట్లు 50 ఓవర్ల మ్యాచ్‌లో పాల్గొనగా, మొదట యెల్లో జట్టు బ్యాటింగ్ చేసి 18.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 75 పరుగులు మాత్రమే చేసింది. ఆ సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన దర్శ్ అగర్వాల్ 80, ఎండీ అద్నాన్ 33 రన్స్ చేయడంతో 44.3 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌటైంది. బ్యాటింగ్‌కు దిగిన రెడ్ జట్టు 50 ఓవర్లలో 179 పరుగులు చేసి ఓటమి పాలైంది. యెల్లో జట్టు బౌలర్లలో జి.చరణ్, డి.లక్ష్మణ్ మూడు వికెట్ల చొప్పున, రెడ్ జట్టు బౌలర్ జాదవ్ రాజ్, ఎండీ అనస్‌లు 4 వికెట్ల చొప్పున తీశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శంకర్ (ఫైల్)

వాంకిడి: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం..మండల కేంద్రంలోని శివకేశవ్‌నగర్‌కు చెందిన ఇటన్‌కార్ శంకర్(27) నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో భార్య రెండునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన శంకర్ ఈనెల 18న మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. పరిస్థితి విషమించడంతో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్టాండ్‌లో ఒకరు..

చెన్నూర్: చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకరు మృతి చెందినట్లు సీఐ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..వేమనపల్లి మండలం గొర్లపల్లి గ్రామానికి చెందిన ఆవుల కనకయ్య (30) చిన్నతనం నుంచి టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. గొర్లపల్లి నుంచి శ్రీరాంపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు శనివారం ఉదయం చెన్నూర్ బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడే ఆరోగ్యం విషమించడంతో మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నేరడిగొండ: ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మండలంలోని లఖంపూర్ పెట్రోల్‌బంక్ ప్రాంతంలో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా, అందులో 11 మంది ప్రయాణికులు ఉండగా, నలుగురికి స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా, బస్సు ముందు భాగంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే డ్రైవర్‌ను అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

జిరాక్స్‌షాప్ యజమాని అరెస్ట్

ఇచ్చోడ: ఆధార్‌కార్డుల్లో పుట్టినరోజు తేదీలు మారుస్తూ మోసాలకు పాల్పడుతున్న మండల కేంద్రానికి చెందిన జిరాక్స్ షాప్ యజమాని అబ్దుల్ తన్వీర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తన్వీర్ గత కొంతకాలంగా ఆధార్‌కార్డుల్లో పుట్టినరోజు తేదీలు మారుస్తూ మోసం చేస్తున్నాడు. దాబా(బి) గ్రామానికి చెందిన మన్నె కృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతూ ఏడుగురు..

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 7గురిని అరెస్టు చేసి, కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఏఎస్సై పోశెట్టి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ఎనిమిది మంది..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాల బైపాస్‌రోడ్‌లో నివాసం ఉండే రియల్టర్ జగన్‌మోహన్ రావు ఇంటి వద్ద ఈ నెల 19న రాత్రి బీఆర్ఎస్‌వీ సంఘం నాయకుడు దగ్గుల మధుకర్‌పై దాడి చేసిన కేసులో ఎనిమిది మందిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ ప్రమోద్ రావు తెలిపారు. దాడిలో పాల్గొన్న ఆత్మకూరి సంజీవ్, డీటీ సాయితేజ, బెల్లంకొండ రాకేష్, వినయ్, సురిమిళ్ల వేణు, పాదం కుమార్, అరికే రాకేష్, గుర్రాల వంశీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇదే ఘటనలో స్థానిక ఇస్లామ్‌పుర గౌతమినగర్‌కు చెందిన ఎల్కపెల్లి సాయిపై దగ్గుల మధుకర్ దాడి చేశాడని ఈ నెల 20న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.


వర్షం కోసం పూజలు



గంగనీళ్లు నెత్తిన పెట్టుకుని వెళ్తున్న మహిళలు

సిరికొండ: మండలంలోని కోసుపటేల్‌గూడ గ్రామస్తులు ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు గంగనీళ్లను నెత్తిన పెట్టుకుని 3 కి.మీ దూరం గల సుంకిడి గ్రామంలోని శివాలయానికి తీసుకువచ్చారు. గంగానీళ్లతో శివునికి జలాభిషేకం చేశారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని మొక్కుకున్నారు.

ఆటోబోల్తా



రాజేందర్ మృతదేహం

కడెం: మండలంలోని అంబారిపేట్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దూర్‌కు చెందిన వర్దెల్లి రాజేందర్(రాయమల్లు), వర్దెల్లి మల్లేశ్, గుండారపు కృష్ణ ఆటోలో దస్తురాబాద్ నుంచి కడెం వైపు వస్తున్నారు. అంబారిపేట్ సమీపంలోని బ్రిడ్జి మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని 108లో ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాజేందర్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మల్లేశ్, కృష్ణను మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

ప్రాజెక్టులో దూకి యువకుడి ఆత్మహత్య

భైంసారూరల్: గుండేగాం శివారులోని పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని వాడి గ్రామానికి చెందిన జాదవ్ పరుశురాం (22) కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి బయటకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం స్థానికులకు పల్సి కర్ రంగారావు ప్రాజెక్టు వద్ద మృతదేహం కనిపించడంతో పోలీసులు, కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

ముధోల్: మండలంలోని వడ్తాల గ్రామానికి చెందిన హన్మొల్ల వినేష్(29) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వినేష్, అర్చన దంపతులు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. వినేష్ వ్యవసాయ కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య అర్చనతో తరచూ గొడవపడేవాడు. కొన్నిరోజుల క్రితం ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టిల్లు అయిన లోకేశ్వరం మండలం పొట్‌పెల్లి గ్రామానికి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి వినేష్ మనస్తాపం చెందాడు. ఈక్రమంలో శనివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి సాగర ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌పై పడిన విద్యుత్ స్తంభం

- దస్నాపూర్ కాలనీలో ఘటన
- తండ్రికి స్వల్పగాయాలు..క్షేమంగా బయటపడిన కుమారుడు



స్తంభం పడడంతో దెబ్బతిన్న బైక్

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ స్తంభం బైక్‌పై పడిన ఘటనలో తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. కుమారుడు క్షేమంగా బయటపడ్డాడు. మావల మండలం దస్నాపూర్ కాలనీలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్ దెబ్బతింది. విద్యుత్ శాఖ ఏఈ జనార్దన్ రెడ్డి కథనం ప్రకారం.. దస్నాపూర్‌లోని తిరుమల పెట్రోల్ పంపు నుంచి దస్నాపూర్ కాలనీ మీదుగా కైలాస్‌నగర్ వరకు 33 కేవీ లింక్‌లైన్ విద్యుత్ పనులు కొనసాగుతున్నాయి. దస్నాపూర్‌లో కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్ శాఖ టౌన్ త్రీలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న అజ్మత్ తన కుమారుడిని పాఠశాల నుంచి బైక్‌పై తీసుకువస్తున్నాడు. పెట్రోల్ అయిపోవడంతో బైక్‌పై కుమారుడిని కూర్చొబెట్టుకుని ఓ గల్లీ గుంచి తోసుకుంటూ వస్తున్నాడు. ఈక్రమంలో కాంట్రాక్టర్, సిబ్బంది చెట్టుకొమ్మను తొలగిస్తున్నారు. స్తంభానికి కట్టి ఉన్న జియో కేబుల్‌పై చెట్టుకొమ్మ పడింది. దీంతో స్తంభం విరిగిపోయి బైక్‌పై పడింది. అజ్మత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కుమారుడికి క్షేమంగా బయటపడ్డారు. గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అఫ్జలుద్దిన్, పక్కన ఎస్సై

బెల్లంపల్లి: మహారాష్ట్రలో కొనుగోలు చేసి అక్రమంగా బెల్లంపల్లికి తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకుని, ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేశారు. బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలుద్దిన్ కథనం ప్రకారం..బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఆటోడ్రైవర్ ఎస్.కే ముజ్జు మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఆర్టీసీ బస్సులో వస్తున్నట్లు తెలుసుకుని కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద మాటువేశారు. ముజ్జు బస్సు దిగగానే టూటౌన్ ఎస్సై మహేందర్, పోలీసులు శనివారం తనిఖీ చేశారు. బ్యాగ్‌లో కిలో 78 గ్రాముల గంజాయి లభించింది. దీని విలువ రూ. 26,950 ఉంటుందని అంచనా వేశారు. సదరు గంజాయిని స్వాధీనం చేసుకుని పంచనామా చేశారు. నిందితుడిపై టూటౌన్‌లో కేసు నమోదు చేసి కోర్టుకు పంపించినట్లు సీఐ పేర్కొన్నారు.